

కరీంనగర్‌రూరల్: చామనపల్లిలో నృత్యాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



కరీంనగర్‌రూరల్: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తున్న ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య

# అంబరాన్నంటిన సంబురాలు

- గంగుల గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ పటాకులు కాల్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



కరీంనగర్‌రూరల్: సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

తెలంగాణచౌక్, డిసెంబర్ 3: కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ విజయం సాధించిన సందర్భంగా తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య ఆధ్వర్యంలో నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. సంఘ సభ్యులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీలం మొండయ్య మాట్లాడుతూ, గంగుల కమలాకర్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల జయరాం, పట్టణ గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్, పట్టణాధ్యక్షుడు జంపాల సంపత్, ప్రధాన కార్యదర్శి కంది వెంకటేశ్, నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

### కరీంనగర్ రూరల్ మండలంలో..

కరీంనగర్ రూరల్, నవంబర్ 3: కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. వేడుకల్లో ఆత్మ చైర్మన్ ఆరె శ్రీనివాస్, చలమయ్య, మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్, డిసెంబర్ 3: నగరంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇంటి వద్ద, తెలంగాణ చౌక్‌లో, పలు డివిజన్లలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచి, పటాకులు కాల్చారు. గంగుల అభిమానులు రంగులు చల్లుకుని, బ్యాండ్ మేళాలు వాయిస్తూ, నృత్యాలు చేశారు. కాగా, ఉదయం నుంచి ఇంటి వద్దనే ఉండి ఓట్ల లెక్కింపు సరళిని తెలుసుకున్న గంగుల కమలాకర్, చివరి రౌండ్ లెక్కింపు ముగిసిన అనంతరం గెలుపు ధ్రువీకరణ పత్రం తీసుకునేందుకు లెక్కింపు కేంద్రానికి వచ్చారు. ఓట్లు లెక్కిస్తున్న ఎస్సారార్ కళాశాల పరిసరాల్లోకి గంగుల రాగానే ఆయన అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ఎదురెళ్లారు. వారికి అభివాదం చేసిన గంగుల లెక్కింపు కేంద్రంలోకి వెళ్లారు.

### ఎంఐఎం ఆధ్వర్యంలో విజయోత్సవాలు

నగరంలో ఎంఐఎం నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ నివాసం నుంచి బస్టాండ్ సమీపంలోని శ్వేత హోటల్ వరకు అఫ్ఘనిస్తాన్ మర్ఫా బ్యాండ్ మేళంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఎన్నికల ఫలితాలు వీక్షించేందుకు వీలుగా గులాం అహ్మద్ హుస్సేన్ నివాసంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. నగరంలోని ఎంఐఎం ముఖ్యనాయకులు, కార్యకర్తలంతా అక్కడికి తరలివెళ్లి ఫలితాలను వీక్షించారు.

కరీంనగర్, డిసెంబర్ 3: హైదరాబాద్‌లో ఎంఐఎం ఏడు స్థానాల్లో గెలువడంతో పాటు కరీంనగర్‌లో ఎంఐఎం ఫ్రెండ్లీ మద్దతుతో గంగుల కమలాకర్ నాలుగోసారి విజయం సాధించడంపై పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు గులాం అహ్మద్ నివాసంలో స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. కరీంనగర్‌లో గంగుల కమలాకర్ గెలుపు అభివృద్ధికి సూచిక అని గులాం అహ్మద్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన అరబిక్ మర్ఫా బ్యాండ్‌ను గులాం అహ్మద్ నివాసంలో వాయిస్తూ ఎంఐఎం జెండాలను ప్రదర్శిస్తూ సంబురాలు చేసుకున్నారు. సంబురాల్లో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, ఖమ్రొద్దీన్, అతీఫ్ అతీన, కార్పొరేటర్ మహ్మద్ షర్ఫొద్దీన్, నాయకులు అలీ బాబా, కరీం ఖాన్, సాజిద్, అవేజ్, యాకూబ్ ఖాన్, షేక్ సమీ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సారార్ కళాశాల ఆవరణలో సంబురాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, గంగుల కమలాకర్ అభిమానులు



గంగుల కమలాకర్ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తున్న ఎంఐఎం నాయకుడు గులాం అహ్మద్, తదితరులు



నినాదాలు చేస్తున్న గంగుల కమలాకర్ అభిమానులు



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు



సంబురాలు చేసుకుంటున్న ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు



తులసీ కల్యాణం జరిపిస్తున్న వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ

# వైభవంగా కార్తీక దీపోత్సవం

- తులసీ కల్యాణం
- భక్తులతో కిటకిటలాడిన దుర్గాభవానీ ఆలయం

కరీంనగర్ రూరల్, నవంబర్ 3: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం ఆలయ ధర్మాధికారి, వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి కార్తీక మాస ప్రయోక్త చతుషష్టి పూజలు, దీపసంకల్పం, దీపారాధన, మహామంగళ హారతి, దీప విశిష్టత ప్రవచనాలు జరిగాయి. తులసీ కల్యాణం జరిపించారు. సుహాసినీ సేవాదళ్, దుర్గాభవానీ సేవా సభ్యులు, ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. ప్రమిదలను వివిధ ఆకృతుల్లో అమర్చారు. దీప సంకల్పన అనంతరం ఏకకాలంలో దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయం సుందరేశ్వర స్వామి వారికి భక్తులు గోత్ర నామాలతో అన్నపూజ, మహాలింగార్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. శివాలయం ముందు అమ్మవారి ఆలయ ధ్వజ స్తంభం వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలించి. దీపారాధన చేసి పూజారులకు దీపాదానం చేశారు. ఈ పూజల్లో ఆలయ అర్చకుడు పవనకృష్ణ శర్మ, ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

# ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కలెక్టరేట్, డిసెంబర్ 3: నగరంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ దివ్యాంగులు, వయోవృద్ధుల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంలో, వారి సంక్షేమం కోసం దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని స్పష్టం చేశారు. ఆత్మవిశ్వాసంతో దివ్యాంగులు ముందుకు సాగాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించాలని వసతిగృహంలో ఉండే దివ్యాంగ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆర్ శ్రీనివాస్, వార్డెన్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి మిఠాయి తినిపిస్తున్న డీడబ్ల్యూవో సరస్వతి

## ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, డిసెంబర్ 3: జిల్లా కేంద్రంలోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ వారి ఖాదీ భవన్‌లో ఖాదీ వస్త్రాలు ఈనెల 31వ తేదీ వరకు 40% ప్రత్యేక తగ్గింపు ధరకు విక్రయిస్తున్నట్లు సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు ధరించాలని కోరారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, డిసెంబర్ 3: నగరంలోని 11కేవీ మంకమ్మతోట ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగింపు, డీటీఆర్ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, కశ్మీర్ గడ్డలో కొంత ప్రాంతం, గోపాల్ రావు బిల్డింగ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.